# బాల్యస్నేహం

(కళ్యం)

వెంకడు కలకత్తాకు వచ్చి చాలా దినాలయినది చేతిలోని డబ్బులు ఖర్చయి పోతూరాగా ఎక్కడయినా పని దొరుకుతుందా అని చూశాడు. సరియయినది ఎక్కడా దొరకలేదు. ఇంతకూ వానికి బెంగాలీగాని హిందూస్థానీగాని బాగా రాదు. మరి కలకత్తాలో తెనుగువారు చాలా తక్కువ. చివరకు కబుర్లు చెప్పుకొనేటందుకు కూడా మనుష్యులు కనబడలేదు.

ఈస్థితిలో ఉండగా వెంకడికి ఒకనాడు గంజాముజిల్లానుంచి వచ్చిన ఒక ఒరియా మనిషి గుర్తయినాడు. వాడికి కొద్దికొద్దిగా తెలుగు తెలుసు. మహాసముద్రంలో మునుగుతుండేవానికి పడవచెక్క కనిపించినట్లు అతడు కనబడగానే వెంకడికి ప్రాణాలు లేచివచ్చినవి. జగబంధుపట్టనాయికుడే తనకు పరమబంధువని ఎంచి వానితో కలిసి కొన్నిరోజులు ఉల్లాసముతో తిరుగుతుండేవాడు.

జగబంధు ఒక కిల్లీ దుకాణ్దారుడు. పగలల్లా అందులో బేరం చేసుకుంటూ రాత్రి దాని వెనుకనున్న ఒకచిన్న గదిలో నిద్రపోతూ అతడు కాలం గడుపుతుండేవాడు. వెంకడుకూడా జగబంధు లేనప్పుడు ఆదుకాణంలో బేరం జరుపుతూ వాని చిన్న గదిలోనే భోజనపానాదులు చేస్తూ కొన్ని దినములు గడిపాడు.

ఒకనాడు మధ్యాహ్నం, దుకాణానికి హిందూస్థానీయువతి యొకతె వచ్చి కిల్లీ లడిగింది. జగబంధు లేడు. వాని స్థానంలో కూర్చున్న వెంకడు తొందరగా కిల్లీకట్టి చేతికిచ్చాడు. వెంటనే దానిని తీసుకొని ఆమె చక్కా వెళ్లింది. వెంకడు "పైసా పైసా" అని కేక లేస్తుంటే బదులుచెప్పక వెనక్కుచూచి నవ్వుకుంటూ ఆమె తనదారి తాను బట్టింది. వెంకడికి ఏమి చేయాలో తోచలేదు. దుకాణం విడిచి ఆమెవెంబడి పోలేడు. కిల్లీ డబ్బు నష్టపడడానికి మనస ్సొప్పదాయెను. అందువల్ల "పైసా, పైసా" అని బిగ్గరగా కేకవేశాడు! దానితో గుంపు పోగయింది. "ఏమి ఏమి" అని వారందరూ వెంకణ్ణి అడిగితే బదులు చెప్పడానికి భాషరాదు. ఈ విధంగా ఒకపావుఘంట దాటింది. అంతలో పోలీసువాడు వచ్చి గుంపును చేర్చినదానికి దుకాణదారుణ్ణి మందలించాడు. పోలీసు రాకతో గుంపు తరిగిపోయింది.

ఇంతలో జగబంధు వచ్చాడు. తన కష్టాలన్నీ ఒకటేమాటు అతనితో చెప్పుకుందామని ఎదురుచూస్తున్న వెంకడికి జగబంధుముఖం చూడగానే మాటతోచలేదు. హటాత్తుగా జగబంధు అన్నాడు- "నా దుకాణం విడిచి వెళ్లు. ఇక్కడ ఒక్కనిమిషం నీవుండకూడదు." వెంకడు నిర్ఘాంతపోయాడు. తాను చేసినదానిలో ఏ తప్పూ అతనికి కనబడలేదు. సమాధానం ఏదో చెప్పబోయాడు కాని జగబంధు ససేమిరా అని వినడాయెను.

దానితో వాని యాత్రలు కలకత్తాలో మరల మొదలయినవి.

పాపం! పల్లెటూరినుంచి మొట్టమొదట మహానగరానికి వచ్చిన వెంకడికి నగరపరిస్థితు లేమితెలుసు? దుకాణదారునికి స్నేహితురాలయిన ఆ యువతిని డబ్బడగ కూడదని తెలియదు. దుకాణాలదగ్గిర అల్లరిచేసేగుంపు పోగుచేయకూడదని తెలియదు.

తన గ్రామం విడిచివెళ్లినపుడు వెంకడు పాతికరూపాయలుమాత్రం చేతబట్టుకొని వెళ్లాడు. అయితే కొన్ని దినాలలోనే ఆ మొత్తం కలకత్తాలో కృశించింది. తర్వాత అతను చాలా భయపడుతూ వచ్చాడు. తిరిగీ యింటికి పోదామంటే తగినంతడబ్బు లేదు. కలకత్తాలోనే ఉందామంటే అందుకూ చాలదు. ఏం చేయనురా భగవంతుడా అని ఒకనాడు చౌరంగీమైదానంలో యోచిస్తూ కూర్చున్నాడు కడుపు మాడుతూండినా తక్కిన రూపాయలను ఖర్చుచేయకూడదని అట్లే కూర్చోగా ఆయాసంవల్ల నిద్ర వచ్చింది. వేసవికాలం, చమటలు కాలువలుగా దేహంనుంచి కారుతున్నవి. పైదుస్తులనన్నిటిని విప్పి తలకిందపెట్టుకొని వెంకడు అక్కడనే నిద్రాపరవశు డయినాడు.

వేకువజా మయింది. వాని కింకా మెలకువ రాలేదు. అయితే కొద్దిగా చలిగాలి వీచిన దానివల్ల పై నొకగుడ్డను కప్పుకొని నిద్రిద్దా మనుకొన్నాడు. తన గుడ్డలమూట కోసం వెదికాడు, అది మాయమయినది. దాంతో అతనికి మెలకువపూర్తిగావచ్చింది. ఎక్కడ చూచినా మూట దొరకలేదు. తన రూపాయలుకూడ అందులోనే ఉన్నవని జ్ఞాపకంవచ్చింది. గుండె ఝుల్లుమన్నది. కట్టుబట్టతప్ప అతని దగ్గిర ఏమీ లేదు. కాళ్లు చేతులు కదలక నిలుచునేందుకు శక్తిలేక అక్కడనే కూలబడ్డాడు.

కొంతసే పయినది. అతనిబుద్ధి చాలా చురుకుగా పనిచేయ నారంభించింది. ఆ కలకత్తామహానగరంలో తన స్నేహితు డొకడున్నాడని జ్ఞాపకం వచ్చింది. పాపన్న తన బాల్యస్నేహితుడు. ఇద్దరూ చేరి గోలీలాడుకునేవారు. అయితే పదిహేనుసంవత్సరాల క్రిందట పాపన్న కలకత్తాకు వచ్చియుండెను. ఆతడు గ్రామంయొక్క తనబంధువులతో జాబూ జవా బేమీ పెట్టుకోక పోయినా, చాలా ధనం సంపాదించాడనీ ఒకమోటారు కూడా బెట్టాడనిన్నీ, చాలామాట్లు వెంకన్న వినిఉన్నాడు. ఆ జ్ఞాపకంతో అతనికి ధైర్యమేగాక దేహశక్తికూడ వచ్చింది. "ఈ ఊరిలోనే ఉండే మన పాపన్నను కనుక్కోలేనా? అందులో సాధారణ మనిషికాడు! మోటారుకూడా ఉంచాడు" అంటూ పైకి లేచి వడివడిగా నడవనారంభించాడు.

ఆ రోజల్లా వీథిలోని మోటారుల నన్నిటిని చాలా జాగ్రత్తతో పరీక్షిస్తూవచ్చాడు. అప్పు డప్పుడు పాపన్న తన్ను బాల్యస్నేహితునిగా గుర్తించునా గుర్తింపడా, గుర్తించి నను ఆదరించునా లేదా అనేటి సందేహాలు వచ్చేవి. అయితే వాటిని వెంటనే అణగదొక్కేవాడు. "పాపన్న ఎంతో మంచివాడు. అందులో బాల్యస్నేహిత మంటే విశేషం. ఎప్పటికీ మరవడు. తప్పక గుర్తిస్తాడు. ఆదరిస్తాడు. ఈ సందేహ మేమిటి? నాముఖం" అనుకునేవాడు!

ఆనా డల్లా తిరిగాడు. పాపన్న కనబడలేదు. అయితే, చూడగా చూడగా మోటారుల్లో తేడా లున్నాయని తెలిసింది! "పెద్ద

మోటారా? లేక చిన్నమోటారా? మన పాపన్నది" అని సందేహంవచ్చింది! "పెద్దదే అయియుంటుంది! పదిసంవత్సరాలుగా డబ్బు సంపాదిస్తున్నాడే, వెధవ చిన్నమోటా రెందుకు పెట్టాలి? దర్జాగా పెద్దమోటారే పెట్టుంటాడు" అని సమాధానం తెచ్చు కున్నాడు!

రెండవరోజల్లా గడిచింది. లాభం కన బడలేదు. మూడవనాడొచ్చే టప్పటికి వెంకన్న ఎవరినయినా అడుగుదా మను కున్నాడు. ఆ ఉద్దేశంతో ఒకకారు వీధిలో నిలబడియుంటే దాని దగ్గిరగా వెళ్లాడు. వెనుకనుంచి బలవంతంగా ఎవరో తన్నులాగి ఆవల పారేశారు. దానితోపోయి దూరంగా నేలకూలబడ్డాడు. ఎవరురా యింత పని జేసిం దని చూస్తే ఒకదర్వాను. ఆకారు ఒకపెద్ద షాపుదగ్గిర నిలుచుంది. దానితలుపు తీయ డానికని ఆ దర్వాను వస్తూంటే దాని కడ్డుగా వెళ్లాడు వెంకడు. వెంకణ్ణి జూచి ఆ కారులోని దొరసాని దగ్గిరికి వచ్చి వాని చేతిలో ఒక అణాడబ్బు పెట్టి ఏదోచెప్పుతూ ఆషాపులోనికి వెళ్లింది. అయితే దర్వానుమాత్రం వాడిని చురచుర చూస్తూనేయుండెను. జంకి ఆణా డబ్బులు చేతబట్టుకొని వెంకడు త్వరగా అక్కడి నుంచి వెడలిపోయాడు.

ఎనిమిదిరోజులు కడచినాయి. పాపన్న ఎక్కడా కనబడలేదు. వెంకడిస్థితి నానాటికి కష్టతర మవుతూవచ్చింది. దొరసానిచ్చిన అణాడబ్బులు ఎప్పుడో సెలవయిపోయినవి. తర్వాత ఆహారమే లేదు. ఏమీ తోచక ఆ మహానగరంలో ఇటూ అటూ తిరుగుతుంటే వాడికి ఒకనాడు హఠాత్తుగా జగబంధు దుకాణం కనబడింది. ఏమయినా సహాయం కోరుదామని నోరెత్తేందుకుముందే జగబంధు ఒకబీడి వాడిముఖాన పడేసి పొమ్మన్నాడు. నిరాశతో అట్లే కాళ్లీడ్చుకొని కొంచెం ముందుకు వెళ్లి అక్కడ ఒకమూల కూర్చు న్నాడు. చెవులు ఓరుమనినాదం చేస్తున్నవి. అయినా అతడు వచ్చేపోయే మోటారులను మాత్రం పరీక్షిస్తున్నాడు.

చిట్టచివరకు అతని ప్రయత్నము సఫల మయినది. ఒకమోటారు వచ్చి అతనిదగ్గిర ఆగింది, డ్రైవరు దిగి వెంకన్నను లోపలికి వచ్చి కూర్చోమ్మన్నాడు. "మా మాస్టరు గారు మీ రలా పోతుంటే చూచారండి! బాల్యస్నేహితులు వారి నింటికి తీసుకొని వెళ్లు. కావలసిన ఉపచారాలన్నీ జరగనీ అంతలోనే నేను వచ్చి వారిని తెలుసుకుం టాను అని నాకు సెలవిచ్చారండి" అన్నాడు.

తన అదృష్టానికిన్నీ, ఆనందానికిన్నీ కన్నీరు కారుస్తూ వెంకడు గొప్పభవనము చేరాడు. మెట్లెక్కుతుండగానే ఒకయువతి చిరునవ్వుతో ఆహ్వానించి లోపలికి పిలుచు కొనిపోయినది. ఆమెను చూడగా చూడగా అతనికి చిన్నప్పటి సంగతి జ్ఞప్తికి వచ్చింది. ఆమె చిన్నప్పుడు తమతో ఆట్లాడుతూండిన రామక్క.

"మీరు రామక్కగాదా?" అని అడి గాడు.

"అవునండీ! మీరు పోల్చుకోగలరో లేరో అని నే నూరకున్నాను"

"పోల్చుకోలేకేమమ్మా? మీరు ధనికు లయినా నన్ను పోల్చి ఆదరించేటప్పుడు మిమ్మును నేను పోల్చుకోలేకపోవడమేమిటి? బాగుంది" అన్నాడు.

"లేచి స్నానంచేయండి. ఏదయినా ఫలాహారం చేతురుగాని; ఇంతలో మామయ్యయింటికొస్తాడు!" అన్నది.

వెంకన్నను నౌకరు వకడు వెంట బిలుచుకొనిపోయి స్నానం చేయించాడు. కొత్త ఒసిస్తులను మరొక డందించాడు. అంతలో ఫలాహారపదార్థాలు తయారు కాగా వెంకన్న చాలా ఆకలికొన్నవాడు కాబట్టి యించుకయినా సంకోచంలేక వాటిని నిశ్శేషంగా తిన్నాడు. రామక్క ఉపచారవాక్కులు చెపుతూ ఎదురుగా నిలిచియుండెను. తింటూ తింటూ వెంకన్న తన స్నేహితుని అదృష్టమును, ఔదార్యమును జూచి తనలో తానే మెచ్చుకుంటూ ఉండెను.

తిన్నతర్వాత, అతనికి తమ భవనమంతా రామక్క సగర్వంగా చూపించింది. లక్ష్మీకటాక్షం పూర్తిగా మీపై నున్నదని మాత్రం వెంకన్న తన ఆనందాన్ని కొంచెం అణచుకొని చెప్పగలిగాడు.

అంతలో నతడు ఆవలించడం చూచి రామక్క అన్నది—"మీరు వెళ్లి కొంచెం విశ్రమించండి! వారింటికి రాగానే నేను కబురంపుతాను!"

అనేకరోజులతర్వాత కడుపునిండుగా తిన్న వెంకన్నకు నిజంగా అలసట కలిగియుండెను. అందువలన ఆమె సలహాకేమీ అడ్డుచెప్పక, తనకు చూపెట్టిన ఒక శయ్యాగృహాన్ని ప్రవేశించాడు.

నలుప్రక్కలా నిలువుటద్దాలూ, చిత్రవిచిత్రములయిన పటాలూ; పరుపుదగ్గిరచల్లని గాలి వీచుతుండే యొక ఎలెక్ట్రిక్ఫానూ, ఇంక ఆ మంచం, ఆ పరుపూ, ఆ దోమలతెరా వీటినన్నిటిని జూచి వెంకన్న సంతోషంతో ఉప్పొంగిపోయినాడు. పైదుస్తులను దగ్గరి కుర్చీపైని పారవైచి మంచంపై పడుకున్నాడు. తాను కలకత్తాకు వచ్చినప్పటినుంచీ తనకు జరిగిన కష్టాలన్నీ జ్ఞాపకం వచ్చినవి. తుదకు తన యదృష్టాన్ని చూచుకొని తనలోతాను నవ్వుకున్నాడు. అట్లే కళ్లు బరువుకాగా నిద్రాపరవశు డయినాడు.

అయితే, వెంకన్న మేలుకొన్నది పరలోకంలో? వీథిలో గుంపు కూడింది. పోలీసు భటు డొకడు తన కఱ్ఱతో దానిని దూర ముంచుతూన్నాడు. మధ్య ఒక ప్రేతం ఊరూ పేరూ ఏమీ లేనట్టున్నది. గుర్తూ పరిచయం కలవారు కూడా ఎవరూ కనబడలేదు. పోలీసు రిపోర్టులో "అనాథప్రేత" మని మాత్రం వ్రాయడమయినది.